ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 జనగామ
బుధవారం 18 సెప్టెంబరు 2024

సమష్టికృషితో సమగ్రాభివృద్ధి



జనగామలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

- ఈ ఐదేళ్లలో మరింత ప్రగతి సాధించాలి
- రేవంత్‌రెడ్డి సారథ్యంలో దేశానికి ఆదర్శంగా రాష్ట్రం
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
- ప్రజాపాలన వేడుకల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

జనగామ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల అందరి సమష్టి కృషి తెలంగాణ రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిన తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకోవాల్సి ఉందన్నారు. రానున్న ఐదేళ్లలో తెలంగాణ మరింత ప్రగతి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అస్థిత్వం కోసం ఉద్యమించిన తెలంగాణ స్వరాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత అభివృద్ధి పథంలో ముందంజలో ఉందన్నారు. భూస్వాములను, నిజాం రజాకార్లతో వీరోచితంగా పోరాడి అమరులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ వంటి వారు జనగామ ప్రాంతంలో పుట్టిన వారు కావడం గర్వకారణమన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందన్నారు. సీఎం దార్శనిక పాలనలో విద్యుత్, నీటిపారుదల, వ్యవసాయం, పరిశ్రమలు, ఉద్యోగ, ఉపాధికల్పన వంటి రంగాల్లో అనతికాలంలోనే గణనీయమైన అభివృద్ధిని సాధించామన్నారు. ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే హామీల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రజల చెంతకే అధికారులు వెళ్లి దరఖాస్తులు స్వీకరించేలా ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజాపాలన కింద జిల్లావ్యాప్తంగా ఒక లక్షా 77వేల దరఖాస్తులను స్వీకరించి కంప్యూటీకరించామన్నారు. జనగామ కలెక్టరేట్, మునిసిపాలిటీతో పాటు అన్ని మండలకేంద్రాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాలకు వచ్చిన 15,954 దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించామన్నారు. ఆడపడుచులకు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. దీని కింద జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు ఒక కోటి 2 లక్షల 71 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారన్నారు. దీని ద్వారా మహిళలకు రూ. 45.10 లక్షల లబ్ధి చేకూరిందన్నారు. పెరుగుతున్న ధరల ప్రభావం పేద ప్రజలపై పడకూడదన్న ఉద్దేశంతో మహాలక్ష్మీ పథకం కింద రూ. 500 కే వంట గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నామన్నారు. ఈ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు 78 వేల మంది వినియోగదారులకు గానూ ఒక లక్షా 28 వేల గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామన్నారు. ఈ పథకం ద్వారా ప్రజలకు రూ. 3.87 కోట్ల రాయితీ లభించిందని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీని కింద జిల్లా వ్యాప్తంగా 85,796 మంది వినియోగదారులకు జీరో బిల్లులు జారీ చేశామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా పేదలకు రూ.13.64 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద జిల్లాలో 2908 మంది పేదలు లబ్ధిపొందారన్నారు. నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను నిర్మించనున్నామని తెలిపారు. దేశంలో ఎన్నడూ జరగని విధంగా రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేశామని ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 43,793 మంది రైతులకు గానూ రూ.330.34 కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ కచ్చితంగా అందిస్తామని భరోసానిచ్చారు. జనగామ జిల్లాలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని హితవు పలికారు. వేడుకల్లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

కార్యక్రమం సాగిందిలా..

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య జనగామ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్లు స్వాగతం పలికారు. అనంతరం వేదిక వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆయన నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత ప్రసంగం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. నృత్య ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను, చిన్నారులను అయిలయ్య అభినందించారు. కాగా.. తరిగొప్పులకు చెందిన జాటోత్ వీరన్న కొంతకాలం క్రితం విద్యుత్ షాక్‌తో చనిపోగా ఆయన కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 4 లక్షల చెక్కును భార్యపిల్లలకు అయిలయ్య అందించారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.



అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న అయిలయ్య

బియ్యం లేక విద్యార్థుల పస్తులు!

ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిండుకున్న నిల్వలు

గ్రామస్థులను బతిమిలాడి రేషన్‌రైస్‌ను సర్దుతున్న ఉపాధ్యాయులు

మూడునెలలుగా ఇదే పరిస్థితి అంటున్న అధికారులు

దిక్కుతోచని స్థితిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు



జనగామ కల్చరల్, సెప్టెంబరు17: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం గత కొన్నేళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుండగా తాజాగా జనగామ జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వలు నిండుకోవడంతో విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ప్రతీ నెలా ఒకటో తేదీలోగా ఠంచన్‌గా రిలీజ్ ఆర్డర్ వచ్చి 5వ తేదీలోగా బియ్యాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పదిరోజులు గడుస్తున్నా బియ్యం నిల్వలు లేకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. పిల్లలకు భోజనం పెట్టకపోతే ఉన్నతాధికారులతో తిట్ల దండకం.. పెడుదామంటే ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం లేవని చేతులెత్తేస్తున్న సంబంధిత అధికారుల తీరుతో ఏం చేయాలో పాలుపోక హెడ్మాష్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండే కేజీబీవీ, తెలంగాణ మోడల్‌స్కూల్లో బియ్యం కొరత కారణంగా తీవ్రమైన సమస్య ఎదురవుతోంది. దీంతో ఏం చేయాలో పాలుపోక సంబంధిత హెడ్మాష్టర్లు ఎంఎల్ఎస్ పాయింట్ అధికారులను వాకబు చేస్తే ఒకట్రెండు రోజుల్లో బియ్యం వస్తాయంటూ ఒకే రకమైన సమాధానం పదిరోజులుగా చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజన సమయానికి ఆయా గ్రామాల్లో పరిచయం ఉన్న వ్యక్తుల వద్దకు వెళ్లి వాళ్ల ఇంటికోసం సబ్సిడీపై రేషన్ దుకాణంలో కొనుగోలు చేసిన పీడీఎస్ బియ్యాన్ని బతిమిలాడి అరువుగా తీసుకొస్తూ పిల్లలకు వంట చేసి వడ్డిస్తున్నామని చెబుతున్నారు. అయితే అధికారులు చెప్పినట్లు ఒకట్రెండు రోజులు కాస్త వాయిదాల పర్వం పెరిగి 15 రోజుల దాకా రావడంతో విద్యార్థులకు భోజనం ఎలా పెట్టాలని తీవ్రమనోవేదనకు గురవుతున్నారు. దీంతో పాఠశాలల హెడ్మాష్టర్లు, వసతిగృహాల నిర్వాహకులు దినమొక గండంగా వెళ్లదీస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ఉన్నతాధికారులు పట్టించుకోవాలి..

జిల్లాలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన అధికారుల్లో పర్యవేక్షణ లోపించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. 15 రోజులుగా పాఠశాలకు సంబంధించిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌లో స్టాక్ లేకపోతే ఏ ఒక్క అధికారి కూడా సంబంధిత సమస్యపై పట్టించుకోకపోవడం పట్ల తమ పనితీరుపై ఉన్న చిత్తశుద్ధి తేటతెల్లమవుతోంది. బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలపై జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూడునెలలుగా ఇదే పరిస్థితి : శ్రీధర్‌రెడ్డి, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్

పాఠశాలలకు సంబంధించిన మధ్యాహ్న భోజనం బియ్యం మూడు నెలలుగా తీవ్రమైన కొరత ఉంటుంది. జనగామకు సంబంధించిన స్టాక్ లేకపోవడంతో నిజమాబాద్, కరీంనగర్ నుంచి ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చి సర్దుబాట్లు చేస్తున్నాం. రెండు మూడురోజుల్లో పంపిణీ చేస్తాం.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన పబ్లిక్ హెల్త్ డైరెక్టర్

రఘునాథపల్లి, సెప్టెంబరు 17: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ బి.రవీంద్ర నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించడంతో పాటు నార్మల్ ప్రసవాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, సుధీర్‌కుమార్, స్వర్ణలత, మల్లీఖార్జున్, పీహెచ్‌సీ వైద్యాధికారి కమలహాసన్, ప్రభాకర్, రమాదేవి, సాంబయ్య, సీహెచ్‌వో రామ్‌కిషన్, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య శ్రీ ఉద్యోగుల నిరవధిక సమ్మె

జనగామ రూరల్, సెప్టెంబరు 17: రాజీవ్ ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఈ నెల 18 నుంచి సమ్మెకు దిగనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యమిత్రలకు డాటా ప్రాసెసింగ్ క్యాడర్ కల్పించాలని, జీవో నం.60 ప్రకారం రూ.22,750.ల వేతనం అమలు చేయాలని, ఆరోగ్యమిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించాలని, 16 సంవత్సరాలుగా పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలను తిరిగి పీహెచ్‌సీలో నియమించాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా కల్పించాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు చేపట్టే సమ్మెకు ఉద్యోగులందరూ మద్దతుగా నిలిచి జయప్రదం చేయాలన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 17: పీఎం నరేంద్ర మోదీ మంగళవారం ప్రాధాన మంత్రి ఆవాస్ యోజన -అర్బన్ 2.0 ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్ కుమార్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎం నరేంద్ర మోదీ మాట్లాడుతూ ఐదేళ్లలో రూ.10 కోట్లతో పట్టణంలో గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో భారతదేశం ముందంజలో ఉందని, పట్టణంలో నివసించే పేద, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచేందుకు ప్రధాన మంత్రి ఆవాస్ కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఈఈ దామోదర్‌రావు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'కొమ్మూరి'కి భంగపాటు!

ప్రజాపాలన వేదికపై కూర్చోవడం పట్ల వ్యతిరేక వర్గం అభ్యంతరం

సొంత పార్టీ నేతల నిరసనతో దిగిన డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

ప్రజాపాలన వేడుక వేదికగా జనగామ కాంగ్రెస్‌లో బయటపడ్డ వర్గ విభేదాలు



స్టేజి దిగి కిందకు వస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే. కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి సొంత పార్టీ నేతల నుంచే భంగపాటు ఎదురైంది. ప్రజాపాలన వేడుకల్లో పాల్గొన్న ఆయన సొంతపార్టీలోని వ్యతిరేక వర్గం నుంచి నిరసనను ఎదుర్కొన్నారు. జనగామ కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాపాలన వేడుకలు నిర్వహించగా.. ఆ వేదికపై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూర్చోవడాన్ని.. కొమ్మూరి అసమ్మతి వర్గం తప్పుబట్టింది. ఎలాంటి ప్రొటోకాల్ లేని కొమ్మూరిని వేదికపై కూర్చోనివ్వడం తగదంటూ, ఆయనను వెంటనే కిందికి దించాలంటూ జనగామ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, కాంగ్రెస్ నేత మాసంపల్లి లింగాజీ అభ్యంతరం తెలిపారు. వారు వేదికపైకి వెళ్లి కొమ్మూరిని కిందికి దించాలంటూ ముఖ్య అతిథిగా వచ్చిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కోరారు. ఓవైపు బీర్ల అయిలయ్య ప్రసంగం కొనసాగుతుండగానే ఎర్రమల్ల సుధాకర్ మరోమారు వేదికపై వెళ్లి కొమ్మూరిని కిందికి దించాలంటూ పట్టుబట్టారు. అక్కడ గొడవ జరిగే అవకాశం ఉండడంతో కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ కొమ్మూరికి నచ్చజెప్పడం తో కొమ్మూరి వేదిక దిగి మీడియా గ్యాలరీలో ఆయన వర్గం నాయకులతో కలిసి కూర్చున్నారు. కాగా.. కొమ్మూరి స్టేజీ దిగి వస్తుండగా అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ క్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన ప్రసంగాన్ని ఆపి పార్టీ శ్రేణులు సంయమనం పాటించాలని కోరారు. కొమ్మూరి స్టేజీ దిగి రావడంతో గొడవ సద్దుమణిగింది. అధికారిక కార్యక్రమం అయినందున ఎలాంటి గొడవకు దిగొద్దని, అధిష్టానం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళదామని తన వర్గం నేతలకు కొమ్మూరి నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

బయటపడ్డ విభేదాలు

కొమ్మూరిపై ఆయన అసమ్మతి వర్గం నిరసనతో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్లీనంగా ఉన్న వర్గ విబేధాలు బయటపడ్డాయి. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై పార్టీకి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మునిసిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు కొంతకాలంగా అసంతృప్తితో ఉండటంతో పాటు పార్టీ పెద్దలను కలుస్తూ కొమ్మూరికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో కొమ్మూరి సైతం తన అసమ్మతి వర్గం నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. పార్టీలో సీనియర్లకు గౌరవం ఇవ్వడం లేదంటూ, కొమ్మూరి ఒంటెత్తు పోకడలకు పోతున్నారంటూ ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, కంచె రాములు లాంటి నేతలు విమర్శిస్తుండగా తన ఎన్నికల్లో తనకు, పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా పని చేశారని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చెబుతూ వస్తున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అమ్ముడుపోయి జనగామ నియోజకవర్గంలో పార్టీ ఓటమికి కారణమయ్యారంటూ ప్రతాప్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. కాగా.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి పార్టీలో అంతర్లీనంగా ఉన్న ఈ వర్గ విబేధాలు మంగళవారం జరిగిన ప్రజాపాలన వేడుకల వేళ బహిర్గతమయ్యాయి. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఈ వర్గ విబేధాలకు పార్టీ అధిష్ఠానం ఏ విధంగా చెక్ పెడుతుందో చూడాల్సి ఉంది.



వాగ్వివాదం చేసుకుంటున్న ఇరు వర్గాల నేతలు

వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

సీఎం, పీసీసీ అధ్యక్షుడికి కొమ్మూరి వర్గం లేఖ

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డితో పాటు మరికొందరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, ముఖ్య నేతలు మంగళవారం లేఖ రాశారు. ప్రభుత్వ అధికారికమైన ప్రజాపాలన వేడుకల్లో ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడిని అవమానించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న వారిని తక్షణమే బహిష్కరించాలని లేఖ ద్వారా కోరారు.

ఎర్రజెండా రాజ్యం వస్తేనే బతుకుల్లో మార్పు



జనగామలో జరిగిన సభలో మాట్లాడుతున్న సీకార్ ఎంపీ అమ్రారాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, సీకార్ ఎంపీ అమ్రారాం
- ఘనంగా సీపీఎం బహిరంగ సభ
- ఎరుపుమయమైన పట్టణం

ఎర్ర జెండా పార్టీలు అధికారంలోకి వస్తేనే దేశ ప్రజల బతుకులు మారతాయని, పోరాటాల పురిటిగడ్డ జనగామలో జరిగిన కార్య క్రమానికి తనను ఆహ్వానించడంతో తన హృదయం పులకించి పోయిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, రాజస్థాన్‌లోని సికార్ ఎంపీ అమ్రారాం అన్నారు. తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటాల పక్షోత్సవాల ముగింపులో ఆయన పాల్గొని దేశంలోని అధికార బీజేపీని విమర్శించారు. ఈ సందర్భంగా జనగామ పురవీధులు ఎరుపువర్ణంగా మారాయి. కమ్యూనిస్టు కార్యకర్తల నినాదాలు, పాటలు, ఉపన్యాసాలతో జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి.

జనగామ రూరల్, సెప్టెంబరు 17: ఎర్రజెండా రాజ్యం అధికారంలోకి వస్తేనే దేశ ప్రజల బతుకులు మారుతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, రాజస్థాన్‌లోని సీకార్ ఎంపీ అమ్రారాం అన్నారు. తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటాల పక్షోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి అధ్యక్షతన సీపీఎం నాయకులు మంగళవారం ప్రెస్టన్ గ్రౌండ్ నుంచి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మకొండల్ రెడ్డి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి

మిగతా 6వ పేజీలో..



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్ షర్ట్ వలంటీర్లు

ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీతక్క, ఎంపీ బలరాం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 17: ఆదివాసీ చిన్నారులకు మెరుగైన విద్య నందించి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొత్తికోయ గూడేమైన బంగారుపల్లిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన కంటెయినర్ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత మంత్రి సీతక్కకు గొత్తికోయలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కంటెయినర్ పాఠశాలను ప్రారంభించిన సీతక్క విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య నందించే లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. బడులకు భవనాలను నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోతుండటం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్మించలేకపోతున్నామని, ఈ క్రమంలోనే బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంటైనర్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వందలాది పాఠశాలలు మూత పడ్డాయని విమర్శించారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రేవంత్ నేతృత్వంలో తమ సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఓఎస్డీ మహేష్‌బాబా సాహెబ్ గీతె, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మంత్రి సీతక్క

ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామోదర్



కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 17: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ నియమితులయ్యారు. బుధవారం డిల్లీలో జరిగిన సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు అనంత్‌శర్మ దామోదర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా పని చేస్తున్న దామోదర్‌ను కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సీనియర్ సెక్రటరీగా కూడా బాధ్యతలు అప్పగించారు. 30 ఏళ్లుగా దామోదర్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వినియోగదారుల చైతన్య సదస్సులు, ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు, టెస్ట్ చెక్‌లు, తూనికలు, కొలతల మోసాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు గడువు 1

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సోషల్‌సైన్స్, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ మొదటి దఫా లిస్టులో 2021-22 ఏడాదికి అడ్మిషన్లు పొందిన అభ్యర్థులందరూ అక్టోబరు 1 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పీఎస్ఎల్ సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు ఫీజులు చెల్లించుకోవాలని వివరించారు. ధృవపత్రాలు, ఇతర పీహెచ్‌డీ అడ్మిషన్ల జాయినింగ్ రిపోర్టులతో ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను మళ్లీ నిర్వహించాలి

రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆశావహుల నిరాహార దీక్షలు



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించి ఆశావహులకు న్యాయం చేయాలని విద్యార్థులు రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన దీక్షలు చేపట్టారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. ఆరోగ్య, కుటుంబ సమస్యలతో కేయూలో జరిగిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు హాజరు కాని అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూల్లో మెరిట్ ఆధారంగానే పీహెచ్‌డీ సీట్లను కేటాయించి న్యాయం చేయాలని అన్నారు. ఇంటర్వ్యూలకు రాని అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించిన అందరికీ న్యాయం చేయాలని వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. కాగా, మంద నరేశ్ చేపట్టిన దీక్షల వద్దకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీ రామోజు నరసింహచారి తదితరులు వచ్చి చర్చలు జరిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలు విరమించారు. ఈ దీక్షల్లో పీహెచ్‌డీ ఆశావాహులు, పరిశోధకులు పాల్గొన్నారు.



కేఎంసీలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, తదితరులు

ఎంజీఎంలో అందుబాటులోకి ప్లేట్‌లెట్ యంత్రం


- ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ
- ఎంజీఎంలో వైద్య సేవలపై ఆరా
- డయాలసిస్ రోగులకు మరో 14 పడకలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలో రూ.41లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సింగిల్‌డోనర్ ప్లేట్‌లెట్ కౌంట్ మెషీన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఆస్పత్రిలోని పలు విభాగాలైన ఔట్ పేషంట్, ఆరోగ్యశ్రీవార్డు, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి రోగుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వల్ల రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయని, ఎస్‌డీపీ మెషిన్ ఏర్పాటుతో ఈ సమస్య తీరుతుందన్నారు. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేకరించేందుకు ప్రయివేట్ ఆస్పత్రిలో రూ.12వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ ఎంజీఎం ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిలో 14పడకలకు అప్‌గ్రేడ్ చేసి డయాలసిస్ సెంటరును మంత్రులు ప్రారంభించారు. అదనంగా 10 డయాలసిస్ పడకల యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ మెడికల్ కళాశాలలో రూ.3.45కోట్ల వ్యయంతో నిర్మించే అంతర్గత రోడ్ల పనులను మంత్రులు ప్రారంభించారు. అనంతరం పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో పిల్లల తల్లిదండ్రులకు కల్పిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్ఎంవోలు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన ఎంపీ కావ్య



తనిఖీ చేస్తున్న ఎంపీ కావ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: వరంగల్ ఎంజీఎంలోని ఫార్మసీ విభాగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకొచ్చాడు. వెంటనే స్పందించిన ఎంపీ కడియం కావ్య రోగిని తీసుకొని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చేరుకొని పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. స్టాక్ వివరాలను, రిజిస్టర్‌ను పరిశీలించారు. సుమారు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎంలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

ఎంజీఎం అధికారులతో వరంగల్ కలెక్టర్ సమీక్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలోని అన్ని విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఎంజీఎంలోని డెర్మటాలజీ విభాగాన్ని పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కేఎంసీ హనుమకొండలోకి మార్చాలని ఆదేశించారు. ఎంజీఎం ఫార్మసీ, స్టోర్ విభానికి సంబంధించిన వివరాలు తీసుకొని సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న షాపుల అనుమతుల గురించి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



అక్టోబరు 2వరకు

‘స్వచ్ఛతా హి’

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కాశిబుగ్గ, సెప్టెంబరు 17: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవా -24 కార్యక్రమాల నిర్వహణకు కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేపట్టాల్సిన ప్రచార, పారిశుధ్య కార్యక్రమాల వివరాలను అధికారులు ప్రకటించారు. ‘స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత’ను 2024 థీమ్‌గా ప్రకటించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన, పాఠశాలలు, అంగన్‌వాడీ తదితర కేంద్రాల్లో శ్రమదానం, ఇంటింటికి దోమల నివారణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం, యువతకు క్రీడాకార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, స్వచ్ఛ సాంస్కృతిక కార్యక్రమాలు, మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించనున్నారు. గ్రామసభలు, వైద్య పరీక్షల నిర్వహణ, పారిశుధ్య అవగాహన ప్రదర్శనలు, పారిశుధ్య సిబ్బందికి సన్మానం, స్వచ్ఛత ప్రతిజ్ఞ, బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది.

రోజువారీ కార్యక్రమాలిలా..

- 17న మానవహారాలు, ప్రతిజ్ఞ, చెత్త సేకరణ డబ్బాల ఏర్పాటు.
- 18న వివిధ వర్గాల భాగస్వామ్యంతో సామూహిక పారిశుధ్య కార్యక్రమం
- 19, 20న మొక్కలు నాటడం, ప్రతీ ఇంట అవగాహన, నీటి వనరుల శుద్ధీకరణ
- 21, 22, 23న మొక్కలు నాటడం, ఇంటింటి ప్రచారం, విద్యార్థులతో మానవహారాలు, వ్యర్థాల తొలగింపు.
- 24న ప్రత్యేక పారిశుధ్య పనులు
- 25న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ సంచుల వాడకంపై ప్రచారం.
- 26న స్వచ్ఛ ఆహార వినియోగంపై కళా ప్రదర్శనలు
- 27న యాత్ర, పర్యాటక స్థలాల్లో పారిశుధ్య పనులు, పోటీల నిర్వహణ
- 28న సఫాయి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు
- 29న సఫాయి మిత్ర సురక్ష శిబిరం, వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణ.
- 30న స్వచ్ఛతపై ప్రతిన, మానవహారాల ఏర్పాటు, మొక్కలు నాటడం, కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు.
- అక్టోబరు 1న సంపూర్ణ స్వచ్ఛత పట్టణంగా ప్రకటన.
- 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ దివస్ నిర్వహణ. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంతో మారిన ప్రదేశాల గుర్తింపు. కార్మికులకు సత్కారం.

తొడేళ్లగూడెంలో యువతి ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 17 : అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ యువతి ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తొడేళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్ కుమార్తె కల్యాణి (21) డిగ్రీ వరకు విద్యనభ్యసించింది. అనారోగ్యం కారణంగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈనెల 15న ఎలుకల మందు తాగింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు మందు వాసన రావడంతో వెంటనే కల్యాణిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



వర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు వెంకట్‌రెడ్డి, తదితరులు

సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి


కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట పీడీఎస్‌యూ వర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 విద్రోహ దినాన్ని పాటిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 1948 సెప్టెంబరు 17ను విలీన దినమని, విమోచన దినమని పిలుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయాని గుర్తు చేశారు. సెప్టెంబరు 17 విద్రోహ దినమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వర్సిటీలకు వీసీలను నియమించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వర్సిటీలకు నూతనంగా అనుమతులను ఇచ్చి విద్యను ప్రైవేట్‌పరంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రాచకొండ రంజిత్, మర్రి మహేశ్, అర్జున్, జీవన్, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌యూ నేతృత్వంలో..

డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్‌యూ) నేతృత్వంలో మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట మంగళవారం తెలంగాణ విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్లు శ్రావణ్, గణేశ్‌లు హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ హనుమకొండ కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు శరత్, నరేందర్, మహేశ్, చరణ్, అశోక్, దేవేందర్, రక్షత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం ఆధ్వర్యంలో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహిళ గురుకుల అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం (టీఆర్‌డీఈసీఏ) ఆధ్వర్యంలో మహిళ అధ్యాపకులు మంగళవారం శాంతియుత నిరసన దర్నా చేపట్టారు. ఐదు సొసైటీల నేతృత్వంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌డీఈసీఏ అధ్యక్షురాలు డాక్టర్ టి. సాంబలక్ష్మి మాట్లాడుతూ.. గురుకుల కాలపట్టికలో శాస్త్రీయత అవసరమని చెప్పారు. గురుకుల కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని చెప్పారు. తమకు యూజీసీ పే స్కేల్ ఇప్పించాలని, నైట్ స్టే డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 010 పద్దుతో జీతాలు ఇప్పించడంతో పాటు ఆరోగ్య కార్డులను అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్టు

రూ.24వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 17: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో మట్కా నిర్వాహకురాలిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిష్టియన్ కాలనీకి చెందిన జి.శ్రీలత నిరుపేదలకు ఆశలు చూపించి మట్కా నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రూ.24వేల నగదు స్వాధీనం చేసుకుని శ్రీలతను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన శ్రీలతను విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



జాతీయ జెండా ఎగరవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యంశాల్లో చేర్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 4,500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. పోరాటంలో అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, అశోక్, స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, వెంకటరమణ, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాటంపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● ఐనవోలు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై బీజేపీ ఆర్ఎస్ఎస్ చేస్తున్న అసత్య అబద్ధ ప్రచారాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. ఐనవోలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు నెలకొరిగి, 3,500 గ్రామాలను విముక్తి చేసి నైజాం మెడలు వంచి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యద్వారా తెలంగాణకు విముక్తి జరగలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ హిందూ ముస్లిం మధ్య యుద్ధం జరిగిందనే అసత్యాన్ని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎందరో బలిదానాలతో తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వాలు తిరస్కరించడం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర నాయకులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్, స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, మంద సుమన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐజాక్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

వర్సిటీ లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా ఐజాక్ ప్రభాకర్ బాధ్యతలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ ఇన్‌చార్జిగా పీఏ ఐజాక్ ప్రభాకర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ఐజాక్ ప్రభాకర్ లైబ్రరీలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఐజాక్ ప్రభాకర్‌ను వర్సిటీ లైబ్రరీ ఉద్యోగులు సంఘం నేతల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువ అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, జావీద్, ఉప్పుల రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేయూ ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డిలు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు తెలిపారు.



ఎంఈడీ పరీక్షలను పరిశీలిస్తున్న కంట్రోలర్ శ్రీరామోజు నరసింహచారి తదితరులు

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



లింగాలఘణపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో



నర్మెటలో జాతీయ జెండావిష్కరణ



కంచనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు



తరిగొప్పులలో ప్రజాపాలన వేడుకల అనంతరం చెక్కులు పంపిణీ చేస్తున్న నాగపురి కిరణ్

రఘునాథపల్లి, సెప్టెంబరు 17: తెలంగాణకు నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించిన సెప్టెంబరు 17వ తేదీని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి.నరేష్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండి.మోహిన్ ముజ్జబ, గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రత్యేక అధికారులు జెండా ఎగురవేశారు.

● పాలకుర్తి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, సర్కిల్ కార్యాలయంలో సీఐ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల : మండల కేంద్రంలోని మండల కార్యాలయాలలో అధికారులతో పాటు మండల ంలోని పలు గ్రామాల్లోని జీపీల వద్ద మంగళవారం ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ముందు ఎంపీడీవో లక్ష్మీ నారాయణ, తహసీల్ కార్యాలయం ముందు తహసీల్దార్ హుస్సేన్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● కొడకండ్ల : మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం జాతీయ జెండా ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులు, ప్రభుత్వ పాఠశాలల్లో , కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మండల ప్రత్యేక అధికారి చౌడేశ్వరి, ఏపీవో నరిగె కుమారస్వామి, జ్ఞానేశ్వర్, సంఘమిత్ర, యాకయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● చిలుపూర్ : మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. మంగళవారం తహసీల్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ సరస్వతి, మండల పరిషత్తు కార్యాలయం ఎదుట ఎంపీడీవో బర్మావత్ శంకర్, జీపీ కార్యాలయాల్లో పంచాయతీ సెక్రటరీలు ఎమ్డీ అజీజ్‌పాషా, పిట్టల బాబు, నవనీత, ఎన్నకూస రాజు, బాషూ నాయక్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ఈద రమేష్‌కుమార్, ఈజీఎస్ కార్యాలయం ఎదురుగా ఏపీవో మోహన్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని చిలుపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● లింగాలఘణపురం : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వినయలత, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఐకెపీ కార్యాలయంలో ఏపీఎం శంకరయ్య, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో స్పెషల్ ఆఫీసర్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో శాఖాధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

●జఫర్‌గడ్ : ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మంగళవారం మండలంలో ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద తహసిల్దార్ శంకరయ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుమన్, సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ కరుణాకర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి రాజేశ్వర్‌రావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, తదితర ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● నర్మెట : ప్రజా పాలన దినోత్సవాన్ని మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజచారి, ఎంపీడీవో అరవింద్, ఎస్సై నగేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం జాతీయజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వంగాల కళ్యాణి, జక్కుల అనిత, గాదెపాక రాంచందర్ పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జీపీ కార్యాలయాల్లో వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఎల్‌పీవో కార్యాలయంలో డీఎల్‌పీవో వెంకట్ రెడ్డి, వ్యవసాయమార్కెట్ కార్యాలయంలో మార్కెట్ సెక్రటరీ జన్ను భాస్కర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, ఇప్పగూడెంలో సెక్రటరీ శ్రీకాంత్, సముద్రాలలో సెక్రటరీ నరేష్, కొత్తపల్లిలో సెక్రటరీ నర్మద, చంద్రు తండలో సెక్రటరీ శారద, విశ్వనాథపురంలో సెక్రటరీ భవాని, తానేదార్‌పల్లిలో సెక్రటరీ వెంకటరమణలు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● బచ్చన్నపేట : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో మహిపాల్‌రెడ్డి, మండల పరిషత్‌లో స్పెషల్ ఆఫీసర్ రామారావు నాయక్‌తో పాటు కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డిలు, గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు పతాకావిష్కరణలు చేశారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవ సంబరాలు డివిజన్ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ వద్ద ఆర్డీఓ డీఎస్ వెంకన్న జాతీయ పతాకావిష్కరణ చేశారు. మండల నోడల్ అధికారి కొమురయ్య పాల్గొన్నారు.



జఫర్‌గడ్‌లో జెండావిష్కరణ దృశ్యం



స్టేషన్‌ఘన్‌పూర్ జీపీ వద్ద ..

ఘనంగా విమోచన దినోత్సవం



జాతీయ పతాకావిష్కరణ చేస్తున్న దశమంతరెడ్డి

జనగామ రూరల్, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన దినాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడుగుల రమేశ్, కేవీఎల్ఎన్.రెడ్డి, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

●నర్మెట : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మంగళవారం మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చౌరస్తాలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రంగు మురళి, నాయకులు ధరావత్ రాజు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ జెండాను ఆవిష్కరిం చారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం జఫర్‌గడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో తెలంగాణ విమోచనా దినోత్సవం బీజేపీ మండల, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివునిపల్లి వివేకానంద చౌరస్తా వద్ద జాతీయ పతాకాన్ని అయన ఎగురవేశారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్, బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రడపాక ప్రదీప్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు బూర్ల విష్ణు, జఫర్‌గడ్ మండల అధ్యక్షుడు నాగేష్, మధు, రాజ్‌కుమార్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడికి తీవ్రగాయాలు

లింగాలఘణపురం, సెప్టెంబరు 17 : మండలంలోని నెల్లుట్లలో జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై గుర్తుతెలియని కారు ఢీకొట్టిన ఘటనలో నెల్లుట్లకు చెందిన మోటె భరత్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లుట్లకు చెందిన మోటె రవి-రజిత కుమారుడు ఆరోతరగతి చదువుతున్న భరత్ సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా జనగామ వైపు అతివేగంగా వెళ్తూ సైక్లిస్టు భరత్‌ను బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈప్రమాదంలో భరత్ తలకు, కాళ్లకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడికి తండ్రి గతంలో మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన భరత్‌ను తల్లి రేణుక కష్టపడి చదివిస్తుందని గ్రామస్థులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు అక్కడి నుంచి తప్పించుకుపోయింది కాగా లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

బచ్చన్నపేట, సెప్టెంబరు 17: స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో శ్రీనివాసచారి, భాస్కరాచారి, నర్సింహ్మాచారి, యాదగిరి, కృష్ణ, ధర్మచారి, కృష్ణమూర్తి, శ్రవణ్కుమార్, శ్రీకాంతచారి తదితరులు పాల్గొన్నారు.

● నర్మెట : మండలకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణులు ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, ఉపేందర్, వినోద్, నవీన్, రమేష్, కృష్ణమూర్తి, శ్రీకాంత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

● చిలుపూర్ : విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వెంకటేశ్వర్లపల్లిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీరామోజు వీరనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు మండలాధ్యక్షుడు సందోజు రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వలబోజు బ్రహ్మాచారి, కేశోజు నిరంజన్, కనకచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

జఫర్‌గడ్, సెప్టెంబరు 17 : ఇటీవల రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన విద్యార్థి కొడారి రాజ్‌కుమార్ కుటుంబీకులను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. మంగళవారం అయన ఉప్పుగుల్లుకు వెళ్లి పార్టీ నాయకులతో కలిసి రాజ్‌కుమార్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో అనారోగ్యంతో మరణించిన శతాధిక వృద్ధురాలు పెసర మల్లమ్మ మృతదేహం వద్ద ఆయన నివాళులు అర్పించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య, మాజీ ఎంపీపీ అయోధ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బచ్చన్నపేట, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీడీవో మల్లిఖార్జున్ అన్నారు. మంగళవారం ఏక్‌పేడ్ మాకేనామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో జీపీల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే పలు గ్రామాల్లో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, ప్రతిజ్ఞలు చేశారు.

●జనగామ రూరల్ : ప్రతీ ఒక్కరు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్లు మహకాళి హరిచంద్రగుప్త, జూకంటి లక్ష్మి అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని సీపీఎస్ స్కూల్, ఏకశిలా పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

● లింగాలఘణపురం : స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం లింగాలఘణపురం మండలంలోన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అధికారులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, ఏపీఎం శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో ఆరోగ్యకర సమాజ స్థాపన

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 17: ఆరోగ్యకరమైన సమాజ స్థాపనకు ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమంలో భాగంగా ఆర్డీఓ తన తల్లి మంగమ్మ పేరుతో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన స్వచ్ఛభారత్ కార్యకమం వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుం దన్నారు. రాష్ట్రంలోనే జనగామ జిల్లాలో అడవులశాతం చాలా తక్కువగా ఉందన్నారు. అడవులశాతం పెరిగేతేనే స్వచ్ఛమైన ఆక్సిజన్ దొరుకుతుందన్నారు. ప్రతీ ఒక్కరు వారి చుట్టుఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయశ్రీ, సెక్రటరీ చుక్క లింగయ్య, ఏపీవో ప్రేమయ్య, హెచ్ఎం సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, సిబ్బంది గట్టు మంజుల, స్వామి, కుంభం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా రాజ్యం వస్తేనే బతుకుల్లో మార్పు

(3వ పేజీ తరువాయి)

మోకు కనకారెడ్డి అధ్యక్షత వహించగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, సీకార్ ఎంపీ అమ్రారాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జనగామ గడ్డ ఉద్యమాల పురిటిగడ్డ అని వీర తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డను చూసి హృదయం పులకించి పోయిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించబడిందన్నారు. సీపీఎం పార్టీ నిర్వహిస్తున్న పోరాటాల వైపు తెలంగాణ రాష్ట్రం ఎదురుచూస్తుందన్నారు. అవసరమ నుకుంటే రైతులు ప్రధాని నరేంద్రమోదీని రైతులు విసిరివేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డకు మొదటిసారిగా తనను ఆహ్వానించినందుకు పార్టీ శ్రేణులకు విప్లవ అభినందనలు తెలిపారు.

సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటు : ఎండీ అబ్బాస్

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించడం సిగ్గు చేటన్నారు. కమ్యూనిస్టులు, రజాకార్లు ఒకటేననడం సరికాదన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూములను భూస్వాముల నుంచి పేదలకు పంచి పెట్టిన పార్టీ సీపీఎం మాత్రమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగసాని రఘుపాల్, శోభన్, పుప్పాల శ్రీకాంత్, యాటల సోమన్న, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జోగు ప్రకాశ్, ధర్మభిక్షం, తదితరులు పాల్గొన్నారు. తొలత సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘన నివాళులర్పించారు.

బుగులు వేంకన్నకు సువర్ణ పుష్పార్చన



చిలుపూర్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ప్రతీ మంగళవారం నిర్వహించే అష్టదళ పాద పద్మారాధన పూజా కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూ 40 లక్షల విలువ గల 108 స్వర్ణాలతో (బంగారం) స్వామి వారి పాదాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి హాజరైన భక్తుల సమక్షంలో ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ నేతృత్వంలోని పూజారుల బృందం ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా దేవస్థానం మాజీ చైర్మ న్, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు - కిరణ్మయి, మాజీ ధర్మకర్త సంగోజు మోహ నాచారి - శంకరలక్ష్మీ దంపతులు సేవా రుసుము చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోరాట వీరుల చరిత్ర యువతరానికి తెలియాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



పాలకుర్తిలో ఐలమ్మ విగ్రహం వద్ద మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దేవరుప్పుల, సెప్టెంబరు 17: సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ, మతోన్మాద శక్తులు చరిత్రకు మతం రంగులు పులుముతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపెల్లి శ్రీనివాసరావు విమర్శించారు. విమోచన దినాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంలోని తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధుడు షేక్ బందగీ స్మారకస్థూపం వద్ద జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా నివాళులర్పించారు.అదే విధంగా ధర్మాపురంలో ఠానూ నాయక్ స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సమావేశంలో జనగామ మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పాతూరి సుగుణమ్మ, నల్ల నర్సింహులు కూతురు నల్ల అరుణ, మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, నాయకులు బెజుగం ఎల్లయ్య, పస్నీరు యాదమ్మ, శ్రీనివాస్, ఎండీ అబ్బాస్, ఓడపెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : తెలంగాణ సాయుధ పోరాట సర్వ హక్కులు సీపీఐ పార్టీకే దక్కుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 76వ వారోత్సవాల్లో భాగంగా సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన నాయకులు ఘనంగా ముగింపు కార్యక్రమాన్ని జనగామలో ఘనంగా నిర్వహి ంచారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కేంద్రంలోని నల్ల నర్సింహులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, ఆధి సాయన్న, ఎం. జనార్దన్, చొప్పరి సోమయ్య, అరుణ పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమాలు చేయాలి

పాలకుర్తి : భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాల్లో భాగంగా ఐలమ్మ విగ్రహం వద్ద ఐలమ్మ వద్ద పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, శ్రీనివాసరావు మాట్లాడారు. పాతూరి సుగుణమ్మ, ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, ఎం జనార్ధన్, చింతకింది అరుణ, యాకూబ్, సమ్మయ్య ఉన్నారు.

● జఫర్‌గడ్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి జువారి రమేశ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సీపీఐ మండల కమిటి ఆధ్వర్యంలో మంగళవారం మండంలోని తమ్మడపల్లి(జి)లో నాటి సాయుధ పోరులో ప్రాణాలర్పించిన అమరులకు స్థూపాల వద్ద నాయకులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నేతలు కూరపాటి చంద్రమౌళి, ఎండి.యాకూబ్‌పాషా, పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, ఎండి.జాఫర్, అన్నెపు అజయ్ పాల్గొన్నారు.

అనంత పద్మనాభస్వామి ఉత్సవాలు

రఘునాథపల్లి, సెప్టెంబరు 17: మండలంలోని ఫతేషాపూర్‌లో గల శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో వెలసిన అనంత పద్మనాభస్వామికి అనంత చతుర్ది సందర్భంగా మంగళవారం అంగరంగ వైభవంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలో ఎక్కడలేని విధంగా ఫతేషాపూర్‌లో అనంతపద్మ నాభస్వామి వెలవడంతో పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. 108 మంది దంపతులు కోటి ఒత్తులతో దీపారాధన చేశారు. ఫతేషాపూర్ గ్రామం పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది.ఆలయ పూజారి రాజేష్ భార్గవ శాస్త్రోక్తంగా అనంత పద్మనాభస్వామి వ్రత కథ, దీపా రాదన నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కేంద్రా నికి చెందిన హరిశ్చంద్రప్రసాద్, పజ్జూరి జయహరి, పబ్బ సంపత్, మాడిశెట్టి సోమశేఖర్, మారం ఉపేందర్, నాగబండి రవీందర్, కాటపల్లి సుధాకర్, మండల ఆర్యవైశ్య సంఘం నాయకుడు అయి తా జయరాములు, మెతుకు కృష్ణమూర్తి, బెల్దె నర్సింహారాములు, ఓరుగంటి శంకర్‌లింగం, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్యను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

దేవరుప్పుల, సెప్టెంబరు 17: హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా జరిగిన లైబరేషన్ డే ను పురస్కరించుకొని మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందుయక్షగాన కళాకారుడు, హంస, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ ఘనంగా సన్మానించారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకాలు



ఘన్‌పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం దెబ్బతినేలా సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహంకు బదులుగా రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అని మాజీ ఎమ్మెల్యే రాజయ్య తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపుమేరకు సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు నిరసనగా మంగళవారం డివిజన్ కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ మారపాక రవి, నాయకులు ఆకుల కుమార్, పసునూరి మహేందర్ రెడ్డి, చల్లా చందర్ రెడ్డి, టి.సురేష్, కనకం గణేష్, పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్ : సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అస్తిత్వాన్ని అవమనపరుస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బాల్దె సిద్దిలింగం అన్నారు. మంగళవారం జనగామ మండలం యశ్వంతాపురం లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం బదులు దేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిసేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు రామ్‌సింగ్, బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య, బస్వ వెంకన్న, తాటిపెల్లి మహేష్, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, ఆర్. వీరాచారి పాల్గొన్నారు.

● కొడకండ్ల : రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని పెట్టడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజి ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పేరం రాము, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్‌చైర్మన్ మేటి సోమరాములు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి మార్కింగ్ చేసిన స్థలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తు జిల్లా బీఆర్ ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి మండల బీఆర్ అధ్యక్షుడు వారాల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కొడకండ్లలో నిరసనలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు